## మన్మోహన్‌సింగ్‌కు నివాళి



గజ్వేల్, డిసెంబర్ 28: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు, ఉపాధ్యాయులు శనివారం నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ రామచంద్రం, డాక్టర్ మహేందర్, డాక్టర్ పెద్దిరాజు పాల్గొన్నారు.

## బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తిచేయాలి



గజ్వేల్, డిసెంబర్ 28: గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో పెండింగ్‌లో ఉన్న బస్టాండ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్ వంటేరు గోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. బస్టాండ్ నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఉండదని, అందుకు త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన



నారాయణరావుపేట, డిసెంబర్ 28 : మండలంలోని గుర్రాలగొంది లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శనివారం ఎంపీడీఓ శ్రీరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదును త్వరగగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, నాయకులు వెంకట్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రాయపోల్, డిసెంబర్ 28 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో చోటు చేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కానుగుల రమేశ్ (45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం, కుటుంబ అవసరాలు, వ్యవసాయ సాగు కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో శనివారం జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య కానుగుల శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్‌దీప్ తెలిపారు.

## మహాసభలను విజయవంతం చేయాలి

గజ్వేల్, డిసెంబర్ 28: సనాతన హిందూ ధర్మజాగృతి మహాసభలను విజయవంతం చేయాలని కామారెడ్డి గురుమెట్ మహాదేవ్ స్వామి కోరారు. శనివారం గజ్వేల్ రామాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలు జనవరి 19న ఆదివారం గజ్వేల్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఆయిల్‌పామ్‌సాగుతో అధిక ఆదాయం



బెజ్జంకి, డిసెంబర్ 28: ఆయిల్‌పామ్‌సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన అధికారి బాలాజీ, వ్యవసాయశాఖ అధికారి సంతోష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మూడేండ్లు కష్టపడితే సుమారు 30 సంవత్సరాల వరకు పంట దిగుబడి పొందండంతోపాటు సబ్సిడీ వస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు రేణుక, భరత్ కుమార్, తేజస్వి, శ్వేత, విజయ్, ఆయిల్‌పామ్ ఫీల్డ్ అధికారి రాములు, యేసుమని పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక, ధార్మికతకు నెలవు సిద్దిపేట

- రూ.45 లక్షలతో వికాస తరంగిణి భవన్ నిర్మాణం
- త్వరలో సిద్దిపేటకు చిన్నజీయర్ స్వామిని తీసుకొస్తా
- సిద్దిపేటలో తిరుపతి శ్రీవారి ఆలయం నిర్మాణానికి కృషి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావును ఆశీర్వదిస్తున్న వేద పండితులు



ప్రత్యేక పూజలో పాల్గొన్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 28 : ఆధ్యాత్మిక, ధార్మికతకు నెలవు సిద్దిపేట అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల గ్రామ శివారులోని వేద భవన్‌లో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహించిన శ్రీగోదాదేవి కల్యాణం, శ్రీసుదర్శన యాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేటలో కరీంనగర్ స్థాయిలో వేద భవన్ వికాస తరంగిణి భవనం అద్భుతంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎకరం ప్రభుత్వ స్థలంలో ఇంత పెద్ద భవనం ఏర్పాటు కావడం రాష్ట్రంలోనే మొదటిది అన్నారు. ఈ భవనాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. సిద్దిపేటలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కోమటి చెరువు ప్రాంతంలో తిరుపతి శ్రీవారి ఆలయాన్ని నిర్మించుకుంటున్నామని, త్వరలోనే రూ.10 కోట్లు టీటీడీ నుంచి మంజూరవుతాయని చెప్పారు. వికాస తరంగిణిని మరింత బలోపేతం చేసుకుందామని, సిద్దిపేటకు చిన్నజీయర్‌స్వామిని తీసుకొచ్చి ఈ భవనాన్ని ఘనంగా ప్రారంభం చేసుకుందామని చెప్పారు. సుదర్శన యాగం, పూర్ణాహుతిలో హరీశ్‌రావు పాల్గొనగా.. వేద పండితులు, వికాస తరంగిణి నిర్వాహకులు ఆశీర్వదించారు.

# కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



తాడూరు భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాలలో బీఆర్‌ఎస్ నాయకుడి కుమార్తె పెండ్లికి హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



లద్నూర్‌లో సోగాల కిష్టయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 28 : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని తాడూరులో పర్యటించారు.తాడూరులోని భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయ 20వ వార్షికోత్సవ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం చేర్యాల పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకుడు పాక పరశురాములు కుమార్తె పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. దేవర చంద్రారెడ్డి తల్లి ఇటీవల మృతి చెందడంతో వాసవి గార్డెన్స్‌లో జరిగిన దశదిన కార్యక్రమానికి హాజరై మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు అన్ని విధాలుగా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు.కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల,టౌన్ అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు, సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, యాట యాదగిరి, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య, టౌన్ సెక్రటరీ బూరగోని తిరుపతిగౌడ్,పచ్చిమడ్ల సిద్ధిరాములు, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, నర్ర ఉపేందర్‌రెడ్డి, అవుశర్ల వెంకటేశ్, కోతి దాసు, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు పాల్గొన్నారు.

**లద్నూర్‌లో మృతుడి కుటుంబానికి పరామర్శ**

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్28: మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో పూర్తిస్థాయిలో నింపాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని లద్నూర్ గ్రామాన్ని ఆయన సందర్శించి రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. లద్నూర్ రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపాలని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతున్న విషయాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన సోగాల కిష్టయ్య మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖల అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, మాజీ వైస్‌ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, పీఏసీఎస్‌వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, సుందరగిరి స్రవంతిపరశురాములుగౌడ్, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు నంద శ్రీనివాస్, నాయకులు కాసర్ల కనకరాజు, మానెపల్లి ప్రభాకర్, రవిరాజు, కాసర్ల రవి, మానేపల్లి సత్యం, మేక ఉమామహేశ్వర్, పుప్పాల బాలస్వామి, షఫిక్అహ్మద్, పైజుద్దీన్, నారదాసు అశోక్ పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

### మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 28 : పారిశుధ్య నిర్వహణపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణీశ్రీధర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది.మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ సమావేశంలో పాలకమండలి చర్చించింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప సూచికంగా రెండు నిమిషాల పాటు మున్సిపల్ పాలకవర్గం, అధికారులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు.సమావేశంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవిటి లింగం, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదాఖాతూన్, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఆరోగ్యరెడ్డి, జీబాబేగం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, కమిషనర్ ఎస్.నాగేందర్, మేనేజర్ ప్రభాకర్, ఏఈ శ్రీనాథ్, టీపీవో కల్యాణ్‌చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ధూళిమిట్ట తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మూర్తి

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్28: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి ఆదేశించారు. శనివారం ధూళిమిట్ట తహసీల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గతంలో ధరణిలో రైతులు చేసుకున్న వివిధ రకాలైన దరఖాస్తులను పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. రైతులకు రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. కార్యాలయ పనితీరుపై తహసీల్దార్ మదుసూధన్ ఆర్డీవోకు నివేదించారు.

## భూమిలేని కుటుంబాలకు రూ.12వేలు అందజేయాలి




ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్, డిసెంబర్ 28: భూమిలేని, ఎకరంలోపు వ్యవసాయ భూమి ఉన్న కుటుంబాలకు రూ.12వేల ఆర్థికసాయం పథకాన్ని ప్రభుత్వం వెంటనే వర్తించే విధంగా చూడాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు శనివారం ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అదజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు భూమిలేని వారికి ఆర్థిక సాయం అందజేసేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. భూమిలేని కటుంబాలకు, అసంఘటిత కార్మికులకు, పట్టణ, గృహ కార్మికులకు వర్తింపజేసే విధంగా విధి విధానాలు ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.

## రోడ్డు బాధితులకు న్యాయం చేయాలి

### కలెక్టర్ మనుచౌదరికి వినతి



కలెకర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేస్తున్న గజ్వేల్ పట్టణవాసులు

గజ్వేల్, డిసెంబర్ 28: పట్టణంలోని కోట మైసమ్మ రోడ్డు బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ శనివారం పలువురు కలెక్టర్ మనుచౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను బాధితులు మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన కలెక్టర్‌తో మాట్లాడి రోడ్డు వెడల్పులో ఇండ్లు కోల్పోయిన బాధితులకు డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ పట్టణ నాయకుడు కళ్యాణ్‌కర్ నర్సింగరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేత



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తున్ ఎంఈవో ఇతర నాయకులు

నంగునూరు, డిసెంబర్ 28 : ప్రభుత్వ పాఠశాలలకు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జేపీతండా ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని 40 మంది విద్యార్థులకు సుమారు రూ.20 వేల విలువ గల స్పోర్ట్స్ డ్రెస్సులను మాజీ సర్పంచ్ భిక్షపతి నాయక్, ఉపాధ్యాయ బృందంతో కలిసి ఎంఈవో దేశిరెడ్డి అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, గ్రామస్తులు లక్ష్మణ్, భాస్కర్, అనిల్, సంపత్, సంతోష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు అందజేత

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 28 : సిద్దిపేట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి గరిపల్లి అశోక్ సహకారంలో విద్యార్థులకు విజ్ఞాన,వినోద, ముఖ్య పర్వదినాలకు సంబంధించిన తెలుగు ముద్రణ పుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కవి అశోక్ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, పుస్తకం గొప్ప నేస్తం.. మంచి పుస్తకాల పఠనంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.క్లబ్ అధ్యక్షురాలు వాణి, వీరేశం,సైన్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.




విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కవి అశోక్

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



సమీక్షలో మాట్లాడుతున్న సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 28: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి -16 విస్తరణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా తీవ్ర గాయాల నుంచి రక్షణ లభిస్తుందనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రాంబాబు, జాతీయ రహదారి అధికారులు, పంచాయతీ రాజ్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్న శ్రీనివాస్



కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న మాదాసు శ్రీనివాస్

గజ్వేల్, డిసెంబర్ 28: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, సిద్దిపేటలో ఎమ్మెల్యే హరీశ్‌రావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. శ్రీనివాస్‌కు స్వీట్ తినిపించి వారు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు దేవీ రవీందర్, చంద్రమోహన్‌రెడ్డి, దుర్గయ్య, కుమార్, రమేశ్‌గౌడ్, మహిపాల్, సంతోష్‌రెడ్డి, అహ్మద్, నిజాం, ఉమార్, రాజు పాల్గొన్నారు.



హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకుంటున్న మాదాసు శ్రీనివాస్

## ప్రభుత్వ స్కూల్‌లో అక్రమంగా టేకు చెట్ల నరికివేత



బైరాన్‌పల్లి హైస్కూల్‌లో నరికివేతకు గురైన టేకు చెట్లు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్28: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి ఉన్నత పాఠశాలలోని టేకు చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నరికివేసినట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాముడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో అక్రమంగా టేకు చెట్లను నరికి వేస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లింగమూర్తి ఆదేశాల మేరకు తాను గ్రామాన్ని సందర్శించినట్లు తెలిపారు. పాఠశాలలోని మూడు టేకు చెట్లను గ్రామ మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్ నరికివేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి, జరిమానా వేయనున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా చెట్లను నరికివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పొలంలో జింకు, భాస్వరం కలిపి వేయవద్దు



పెద్దమాసాన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున

తొగుట,డిసెంబర్ 28: వరిపొలంలో జింకు, భాస్వరం కలిపి వేయడం వల్ల పంటకు అపారమైన నష్టం జరుగుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున అన్నారు. శనివారం మండలంలోని పెద్దమాసానపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి ఎక్కువగా ఉండడం చేత వరికి జింకు పోషక లోపం వస్తుందన్నారు. వరి నాటు వేసే క్రమంలో జింకు భాస్వరం కలపడం వల్ల అవి సల్ఫేట్‌గా మారుతుందన్నారు. యాసంగిలో వరి పంటలు దక్షిణ, ఉత్తరం దిశగా కాలిబాటలు వదిలి పెట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## రాయితీపై మొక్కజొన్న విత్తనాలు పంపిణీ



జగదేవపూర్‌లో రైతులకు రాయితీ మొక్కజొన్న విత్తనాలు అందజేస్తున్న అధికారులు



మర్కూక్: సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాధిక

జగదేవపూర్, డిసెంబర్28: జాతీయ ఆహార భద్రతా మిషన్ మొక్కజొన్న పథకంలో భాగంగా రైతులకు రాయితీపై బయోసీడ్ 9544 హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ములుగు వ్యవసాయ సంచాలకుడు అనిల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వసంతరావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం మొక్కజొన్న విత్తనాలను రాయితీపై రైతులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకంలో భాగంగా 5కేజీల ప్యాకెట్ రూ1375 ఉండగా రూ.500 రాయితీపోను రూ. 875 రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకొచ్చి హనుమాన్ ట్రేడర్స్‌లో సంప్రదించి రాయితీ మొక్కజొన్న విత్తనాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు భానుప్రకాశ్, కృష్ణమూర్తి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**మర్కూక్‌లో..**

మర్కూక్, డిసెంబర్ 28: యాసంగి సీజన్‌లో రైతులకు రాయితీపై మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రాధిక తెలిపారు. మండలంలోని గణేశ్‌పల్లి హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణంలో శనివారం రైతులకు సబ్సిడీ విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. 5కేజీల ప్యాకెట్ ధర రూ,1375 ఉండగా సబ్సిడీ రూ500 పోనూ మిగతా రూ,875లు చెల్లించి విత్తనాలు తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏవోలు హనుమంతరావు, రజనీకాంత్,విష్ణు,మీనాక్షి, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పథకాలను సద్వియోగం చేసుకోవాలి**

మిరుదొడ్డి , డిసెంబర్ 28: వ్యవసాయాధికారుల సలహాలు పాటిస్తూ వివిధ రకాల పంటలు సాగుచేసుకోవాలని ఏవో బోనాల మల్లేశం రైతులకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ మొక్కజొన్న విత్తనాల బ్యాగులను శనివారం ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదు కిలోల మొక్కజొన్న బ్యాగును రూ.875లకు సబ్సిడీపై రైతులకు అందిస్తుందన్నారు.సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో సబ్సిడీ మొక్కజొన్న విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో మల్లేశం